

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

టూటే హువె ఖ్వాబోం నే

హం  కో యె సిఖాయా హై

దిల్ నే, దిల్ నే జిసె పాయాథా

ఆంఖోంనె గవాయా హై

'మధుమతి' సినిమాలో మహమ్మద్ రఫీ అత్యద్భుతంగా  పాడిన విషాద గీతం ఇది. గేయ రచయిత శైలేంద్ర రచించిన ఈ గీతానికి సంగీత దర్శకత్వం వహించింది సలిల్ చౌధరి. నాయిక, నాయకుడు ప్రేమించుకుంటారు. నాయిక మరణిస్తుంది. తనకు భౌతికంగా దూరమయిన నాయికను తలచుకుని విలపిస్తూ నాయకుడు పాడే విషాదగీతం ఇది.

గేయ రచయిత శైలేంద్ర రచనా సంవిధానం ఇతర గేయ రచయితలకన్నా భిన్నం. ఆయన అతి సరళమైన పదాలు వాడతాడు. భావం సూటిగా వుంటుంది. పాటను ఎత్తుకోవటమే విషయం సూటిగా చెప్తాడు. ఎలాంటి వర్ణనలు, డొంక తిరుగుడు మాటలు, వివరణలు, ఉపోద్ఘాతాలు, ఉపమానాలు ఉండవు. అందుకే ఆయన రచించిన అనేక గీతాల పల్లవులు సినిమాల పేర్లుగా నిలిచాయి. ఆయన పాటలలో వాక్యాలనేకం కొటేషన్లుగా ఉపయోగపడతాయి.  అంతేకాదు, టైటిల్ పాటలు రాయటంలో, సినిమా కథ సారాంశాన్ని పాటల్లో ప్రతిబింబించటంలో కూడా శైలేంద్ర దిట్ట.

మధుమతి పాట ఆరంభంలోనే సూటిగా విషయాన్ని చెప్పేశాడు శైలేంద్ర. పతనమైన కలలు ముక్కలు అతనికి హృదయం పొందిన ఆమెను  కళ్లు దూరం చేసుకున్నాయన్న సత్యాన్ని బోధించాయట. భావం ఎంతో గొప్పగా ఉంటుంది. ఆమె అతనికి దూరమయిందని ఒక్క ముక్కలో చెప్పవచ్చు. కానీ పాట, రాగం, నాయకుడి వేదనను ప్రేక్షకుడికి చేరువ చేయటం వంటి అనేక విషయాలను గేయ రచయిత పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పగిలిన కలల శకలాలు అతనికి పాఠం  నేర్పించాయి. ఏం నేర్పించాయి? హృదయం దేన్నయితే తన స్వంతం చేసుకుందో, దాన్ని కళ్లు

పోగొట్టుకున్నాయి. కళ్ళు పోగొట్టుకోవటం అంటే, ఇక ఆమెని అతను చూడలేకపోవటం. ఎన్నటికీ ఆమె అతనికి కనబడదు. ఆమె అతని హృదయంలోనే ఉంది. కానీ అతని కళ్లు ఆమెని చూడలేవు. ఎందుకంటే హృదయానికి కళ్లు లేవు. కళ్లు హృదయంలోకి చూడలేవు. గ్రహించగలవు మాత్రమే. ఇప్పుడామెకి భౌతిక శరీరం లేదు. ఆమెను హృదయంతో గ్రహించాలి. కానీ మనం ఉంటున్నది భౌతిక ప్రపంచం. హృదయంలో ఉంటే సరిపోదు. కళ్లకు కనబడాలి కూడా. ఇలా అనేకానేక భావాలను కలిగించే ఈ పాటను రఫీ తనకలవాటైన రీతిలో అద్భుతంగా పాడాడు.

అయితే ఈ పాటను వింటూంటే, ఎందుకో రఫీ పాడిన 'ఓ దునియాకే రఖ్‌వాలే ' పాట గుర్తుకువస్తుంది. 'రహ గర్దిశోంమె హర్దమ్' అన్న 'దో బదన్' సినిమాలో పాట జ్ఞప్తికి వస్తుంది. ముకేష్ పాడిన 'దిల్ జల్తా హై తో జల్నేదో' అన్న పాట గుర్తుకు వస్తుంది. ఆ పాట వింటూంటే రఫీ పాట 'మై నిగాహే తేరె చెహారే సె ' అన్నపాట గుర్తుకు వస్తుంది. ఒక పాట వింటూంటే, అలాంటి బాణీలోనే ఉన్న ఇన్ని పాటలు గుర్తుకురావటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే దాదాపుగా అన్నీ విరహ, విషాద గీతాలే అయినా పాటలను రూపొందించిన సంగీత దర్శకులు వేర్వేరు. గేయ రచయితలు వేరు. పాటలు వ్యక్త పరచిన భావాలు వేరు.'మై నిగాహే' పాట రొమాంటిక్ పాట. కానీ హఠాత్తుగా వింటే విషాదగీతం అనిపిస్తుంది. ఇక్కడే సంగీత దర్శకులు ఒక పాటకు బాణీని కుదిర్చే పద్ధతి గురించి ఆలోచించాల్సి వస్తుంది.

ఒక పాట మరో పాటలా తోచగానే సాధారణంగా 'కాపీ' అన్న పదం మనసులో మెదులుతుంది. కానీ పై పాటలు వింటూంటే 'కాపీ' అన్న పదం దరిదాపులకు కూడా రాదు. 'దిల్ జల్తా హై' పాట సంగీత దర్శకుడు అనిల్ బిశ్వాస్. సినీ గీతాలకు వ్యాకరణాన్ని ఏర్పరచిన వారిలో ఆయన ఒకడు. 'ఓ దునియా కె రఖ్‌వాలే' పాటను రూపొందించిన నౌషాద్ సినీ గీతాలకు గౌరవాన్ని ఆపాదించి శాస్త్రీయ సంగీత ప్రపంచంలో మన్ననలందుకునేట్టు చేసిన సంగీత దర్శకుడు. 'టూటే హువె ఖ్వాబోనే' సంగీత దర్శకుడు సలీల్ చౌధరి. పాశ్చాత్య బాణీలకు జానపద బాణీలను ముడిపెట్టి అద్భుతమైన లలిత గీతాలను రూపొందించిన వాడు.

'మై నిగాహే' పాట సంగీత దర్శకుడు మదన్ మోహన్. రాగ ఆధారిత పాటలు రూపొందించటంలో దిట్ట. ఆయన పాటలు ఈనాటికీ ఉత్తమ నాణ్యతకు ప్రామాణికాలు. 'రహ గర్దిశోమే' పాట సంగీత దర్శకుడు రవి. అత్యంత మధురమైన గీతాల రూపకర్త. కాబట్టి, వీరు ఒకరినొకొకరు కాపీ కొట్టటం అన్న అలోచననే అనౌచిత్యం. మరి ఈ పాటలు వింటూంటే ఎందుకని ఒకేలాగ అనిపిస్తాయి అని ఆలోచిస్తే తట్టే సమాధానం అన్ని పాటలు ఒకే రాగంపై ఆధారపడినవి. ఆ రాగం రాగ దర్బారీ!

దర్బారీ గంభీరమైన, భావాత్మకమైన రాగం. అత్యంత సంక్లిష్టమైన రాగం. ఈ పాట మనిషి హృదయాన్ని కలచి వేసేంత విషాదాత్మకమైనది. చాలా నెమ్మదిగా పాడే రాగం ఇది. ఈ రాగంలో నిష్ణాతులవటం చాలా కష్టమైన పని. ఈ రాగాన్ని మామూలుగా పాడే వీలులేదు. చాలా నెమ్మదిగా, ఒక్కో స్వరాన్ని అనుభవిస్తూ, నిర్దిష్టమైన స్వరాలవద్ద దీర్ఘం తీస్తూ, రాగం ఆలపిస్తూ, మీండ్, ముర్కి, ఆందోళనలు, ఖట్కా వంటి అలంకారాలు వేస్తూ నింపాదిగా పాడితేనే రాగం ప్రభావం అధికంగా ఉంటుంది. ఈ రాగాన్ని ఉచ్చ స్వరంలో పాడాలి. మంద్ర స్వరంలోనూ పాడాలి. ఒక గాయకుడి ప్రతిభకు పరీక్షలాంటిది ఈ రాగం పాడటం. ఒక గాయకుడి నైపుణ్యానికి నిదర్శనం ఈ రాగం పాడి మెప్పించటం. శ్రోత మనసుపై లోతైన ముద్ర వేసి తీవ్రమైన ప్రభావం చూపించి, గాంభీర్య భావనను కలిగించేందుకు ఈ రాగాన్ని ఆధారం చేసుకుని పాటలను రూపొందిస్తారు సంగీత దర్శకులు.

స్వరాలు ఏడు మాత్రమే. కానీ ఆ ఏడు రాగాల కలయికవల్ల అనంతమైన రాగాలు ఏర్పడ్డాయి. ఆ స్వరాలను పలికే విధానం, ఏ స్వరం తరువాత ఏ స్వరం రావాలి, ఏ స్వరానికి ప్రాధాన్యం ఇవ్వాలి వంటి అంశాలు రాగాన్ని నిర్ధారిస్తాయి. బాణీని ఏర్పాటు చేస్తాయి. దర్బారీ రాగాన్ని తాన్‌సేన్ అక్బర్ దర్బారులో మొదటిసారి పాడేడు. అందుకని ఈ రాగాన్ని దర్బారీ రాగం అంటారు. ప్రతి రాగానికీ తనదైన ప్రత్యేక చలన విధానం వుంటుంది. దాన్ని బట్టి రాగాన్ని నిర్ధారిస్తారు.

దర్బారీ రాగం ఆరోహణలో 'స,రి, రి, గమ, పదనిస' అనే స్వరాలుంటాయి. అవరోహణంలో 'స ద ని పమ పమగ మగ మ సరి స' అనే స్వరాలంటాయి. ఈ స్వరాలను మార్చి మార్చి వాడి, కొన్ని స్వరాలపై ఒత్తిడి చేసి, కొన్ని స్వరాలకు రాగం తీసి, కొన్నిటిని కోమలంగా, కొన్నిటిని తీవ్రంగా పలుకుతూ బాణీని రూపొందిస్తారు. ఏస్ స్వరాన్ని కోమలంగా పలకాలి, దేన్ని సాగదీయాలి వంటి వన్నీ శాస్త్రీయంగా నిర్ణయమైనవి. తీయకూడని చోట రాగం తీస్తే రాగం మారిపోతుంది.

'ఓ దునియాకే రఖ్‌వాలే' పాట ఆరంభంలో మహమ్మద్ రఫీ 'భగవాన్' అంటాడు. 'భగవాన్' అనటంలోనే రాగం 'దర్బారీ' అని గ్రహించవచ్చు. 'గ్' దగ్గర ఆగటం, 'వా' దగ్గర ఆందోళితం చేస్తూ పలకటంతో అత్యంత సుందరంగా ధ్వనిస్తుంది. 'నిరిరి రిగరిగరిస' అంటూ చివరికి 'వాన్' అన్న దగ్గర 'రీ' అంటూ దీర్ఘం తీస్తూ 'సా' అని ముగించటంతోటే దర్బారీ 'మూడ్' స్థిరపడుతుంది. బైజూబావ్రా సినిమాలో ఒక సందర్భంలో తాన్సేన్ పాత్ర దర్బారీ రాగాన్ని సాధన చేస్తాడు. అక్కడ రీసా అంటూ దీర్ఘం తీయటం గమనిస్తే భగ్వాన్ లో వాన్ అంటూ రఫీ దీర్ఘం తీయటం చక్కగా బోధపడుతుంది. 'భగవాన్' అంటూ రఫీ భక్తిని కాదు విషాదాన్ని చిలికిస్తాడు. 'భక్తి'ని పలికించాలంటే రాగం మారిపోతుంది. ఒక పాటను రూపొందించాలంటే సంగీత దర్శకుడికి ఒక్కడికి శాస్త్రీయ సంగీతం తెలిస్తే సరిపోదు. గేయ రచయితకు శబ్దాల శక్తి

తెలియాలి. గాయకుడికి స్వరాల జ్ఞానం ఉండాలి. వాటి ప్రభావం తెలియాలి. రాగాల స్వభావాల పరిజ్ఞానం ఉండాలి. ఎందుకంటే ఒక్క స్వరాన్ని తప్పు పలికినా రాగం మారిపోతుంది. రసభంగం అవుతుంది. అసిధారపై నడవటంలాంటిది ఇది. ఒక్క పదం పొరపాటుగా పడ్డా స్వరం వ్యర్ధమవుతుంది. ప్రాణంపోతుంది. రఫీలాంటి గాయకుడు ఈ అసిధారపై అవలీలగా నడుస్తూ పాటలో భావాలు చిలుకుతూ, నటనను తన స్వరంద్వారా ప్రకటితం చేస్తూ పాట ప్రభావాన్ని ఇనుమడింప చేస్తాడు. అందుకే ఎందరో గొప్పగాయకులున్నా ఒక్క మహమ్మద్ రఫీ, ఒక ఘంటసాల, ఒక లతా మంగేష్కర్‌లు ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచి ఉంటారు.

'ఓ దునియాకే' పాటలో అత్యంత ఆకర్షణీయమైన అంశం రఫీ హై పిచ్‌లో పాడటం. కానీ, ఆ హై పిచ్‌ని అత్యంత ప్రస్ఫుటం చేసే అంశం అంతకు ముందు మంద్ర స్వరంలో పాడిన పదాలు. మిగతా  దర్బారీ రాగ ఆధారిత పాటల్లో కూడా ఈ 'హై పిచ్' ఆకర్షణగా నిలుస్తుంది.

'టూటే హువె ఖ్వాబోనే'  పాట పల్లవిలో 'లౌట్ ఆయీ సదా మేరీ' నుంచి రఫీ స్వరం పైకి ఎదగటం మొదలవుతుంది. 'టక్రాకె  సితారోంసే' అంటూ హై పిచ్ చేరుకుంటాడు. 'ఉజ్డీ హువి దునియాకే ' నుంచి క్రిందకు దిగటం మొదలవుతుంది.

'ఓ దునియాకే రఖ్‌వాలే' పాటలో 'ఆశ్ నిరాశ్‌కె' అంటూ మంద్రస్వరంలో మొదలు పెట్టి 'నయ్యా సంగ్ తూఫాన్' అంటూ మెట్లెక్కటం ప్రారంభిస్తుంది రఫీ స్వరం. 'తూఫాన్' దగ్గర 'మీండ్' అనే అలంకారం వేస్తాడు. 'ఫా'ను సాగదీయటంతో ఆ తుఫాను ఎంత దీర్ఘమో, ఎంత గంభీరమో అనుభవానికి వస్తుంది. ఇదే 'మీండ్' టూటే హువె ' 'ఖ్వాబోం'పాటలో 'దిల్‌నే' దగ్గర వేస్తాడు రఫీ. అద్భుతమైన ఎఫెక్ట్ వస్తుంది. 'రహగర్దిరోమె హర్‌దం' పాటలో 'మెరె ఇశ్క కా  'లో 'ఈఃష్క్' అంటూ 'ఇ'ని సాగదీయటంలో కనిపిస్తుంది. చరణంలో 'కొయి దిల్ కె ఖేల్ దేఖే' అంటూ మెట్లెక్కుతుంది రఫీ స్వరం. 'హమ్ ఢూండ్ తె హై  ఉన్కో' అంటూ 'టూటూ హువే ఖ్వాబోనే' తో మెట్లెక్కినట్టే. ఈ మెట్లెక్కటమే ఎంతో నియంత్రణతో జరుగుతుంది 'మైనిగాహే' పాటలో అంటే, దర్బారీ రాగంలో పాటను రూపొందిస్తే, ప్రతి పాటలో 'హై పిచ్' పాడాలని లేదు. హై పిచ్‌కు వెళ్తూ నియంత్రణను ప్రదర్శించవచ్చు. 'ఛా రహీ  థీ తెరి మహకీహువి జుల్ఫోంకి ఘటా' అంటూ 'తెరి' దగ్గర నుంచి అత్యంత నియంత్రణతో హై పిచ్‌కి వెళ్తూ అత్యద్భుతమైన అలంకారాలు వేస్తాడు. అయితే ఈ పాటలో నియంత్రణ ప్రదర్శించటానికి కారణం ఈ పాట 'శుద్ధ దర్బారీ 'కాదు. ఇందులో 'కాఫీ'తో సహా ఇతర రాగాలు ఛాయా మాత్రంగా ఉంటాయి. 'లుట్‌గయే  హోష్‌తో ఫిర్ హోష్‌మే ఆవూన్  కైసే'లో 'ఆ' దగ్గర వేసిన మీండ్, ముర్కిలు రాగాన్ని 'కాఫీ'వైపుకు మళ్లిస్తాయి.

అంటే, సంగీత దర్శకులు ఒక పాటను ఒక రాగంలో రూపొందించే సమయంలో, పాటలో పలికే భావాన్ని బట్టి ఒక రాగంలో ఇతర రాగాలు మిశ్రమం చేస్తారన్నమాట. శాస్త్రీయ సంగీత గానానికీ, సినిమా పాటల బాణీలను రూపొంచటానికీ ఇది ప్రధానమైన తేడా. స్వరం పలకటంలో కాస్త తేడా వస్తే శాస్త్రీయ సంగీత విద్వాంసులు 'శారదా' అని గొంతు చించుకుని అరుస్తారు. సామాన్యులకు అది అర్థం కాదు. అంతా బాగానే ఉంటే ఈయన 'గొంతు చించుకుంటాడేమిటి?' అనిపిస్తుంది. కానీ శాస్త్రీయ సంగీతం తెలిసిన వారికి, స్వరాన్ని పలకటంలో తేడాతో రాగం మారిపోవటం తెలుస్తుంది. అలా రాగాలు కలవటాన్ని వారు హర్షించరు. కానీ సినిమా పాటల్లో బాణీ అందంగా, ఆకర్షణీయంగా ఉండటం కావాలి. అందుకని 'మూడ్'ని బట్టీ ఒక రాగాన్ని ఎంచుకున్నా అవసరమైతే దానిలో ఇతర రాగాలు కలుపుతాడు. అది పాటకు అందం ఇస్తుంది. సామాన్య ప్రేక్షకుడు పాట వింటూ మైమరచి పోతాడు. మైమరచిపోతున్న సామాన్యులను చూసి శాస్త్రీయ సంగీత విద్వాంసుడు చిరాకు పడతాడు. అయితే, ఇలా ఒక రాగంలో మరో రాగాన్ని కలిపి పాడే సమయంలో గాయకుడి ప్రతిభ స్పష్టమవుతుంది. వినే ప్రేక్షకుడికి రాగంలో ఎలాంటి తేడా తెలియకుండా, రాగాన్ని మిళితం చేసి పాడాల్సి ఉంటుంది. అంటే బాణీని రూపొందించే సమయంలో సంగీత దర్శకుడు గాయకుడి ప్రతిభను దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుందన్న మాట.

'దిల్ జల్తా హై' పాటను రూపొందిస్తున్న సమయంలో గాయకులు హై పిచ్‌లో పాడే ఆనవాయితీ లేదు. సైగల్ కానీ, దుర్రానీ కానీ, సురేంద్ర కానీ మంద్రస్వరంలో పాడే గాయకులు. అందుకని ఆ కాలంలో 'దర్బారీ' రాగంలో పాటను రూపొందించినా 'హై పిచ్' అంతగా కనిపించదు. 'దిల్ జల్తా హై' పాట పాడింది ముకేష్. గాయకుడు ముకేష్‌కు శాస్త్రీయ సంగీతంతో అంతగా పరిచయం లేదు. ఆయన స్వరం హైపిచ్ పలకదు. అందుకని 'దిల్ జల్తాహై' పాట 'దర్బారీ' రాగంలో ఆరంభమయినా ఇతర దారులు పడుతుంది. దాంతో చివరికి 'దిల్ జల్తా హై' అని కాస్త హై పిచ్‌లో పాడితే సరిపోయింది. కానీ 'దిల్ జల్తా హై', 'ఓ దునియా కే రఖ్ వాలే '. 'టూటే హువే ఖ్వాబోనే' పాటల పల్లవులు పాడుకుంటూంటే అన్నీ ఒకే నడకలో నడుస్తాయి. ఎందుకంటే అన్నిటి మార్గం 'దర్బారీ' యే కాబట్టి. కానీ పాడిన స్వరాలు దర్బారీకి చెందిన స్వరాలనే వేర్వేరు స్వరాల కలయికలో వాడటంతో పాటలు వేర్వేరుగా ధ్వనిస్తాయి. పాటల బాణీలు రూపొందించటంలో సంగీత దర్శకుడి సృజనాత్మక నైపుణ్యం ఇలా రాగానికి చెందిన పరిమిత స్వరాల కలయికలో, రాగానికి చెందిన నియమాలను అనుసరిస్తూ ఆకర్షణీయంగా మలచటంలో తెలుస్తుంది.

గాయకుడిగా ముకేష్‌కు  పరిమితులున్నాయి. మీండ్, ముర్కిల్లాంటి అలంకారాలు సులభంగా వేయలేడు. అందుకని ముకేష్‌కు శాస్త్రీయ రాగ ఆధారిత బాణీలు రూపొందించటంలో సంగీత దర్శకుడు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. 'విశ్వాస్' సినిమాలో 'చాందికీ దివార్ నతోడీ' పాటలో కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ ఇదే చేశాడు.  ముకేష్ కొంత వరకే హై పిచ్‌లో

పాడగలడు. 'ఏక్ ధన్వాన్‌కి బేటీనే' అన్న పంక్తులను హై పిచ్‌లో రూపొందించి, ఇదే హైపిచ్‌ను చరణంలో 'సదియోంసే దిల్ టూట్‌త ఆయా' అని దగ్గర కొనసాగించి, దాదాపుగా 'శుద్ధ దర్బారీ' రాగంలో పాటను రూపొంచించారు కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ. అందుకే ఈ పాట పల్లవి కూడా మిగతా దర్బారీ పాటలతో కలుస్తుంది.

అయితే సంగీత దర్శకుడు మదన్ మోహన్ శుద్ధ దర్బారీ రాగంలో కన్నా ఇతర రాగాల కలయికతో పాటను రూపొందించటం కనిపిస్తుంది. 'మై నిగాహే తేరె చెహరే సే' ఇందుకు ఉదాహరణ. ఇదే సినిమాలో లతా మంగేష్కర్ పాడిన 'అగర్ మర్ఝుసే మొహబ్బత్ హై' పాట కూడా దర్బారీ రాగంలో  రూపొందినదయినా ఇది ఇతర దర్బారీ ఆధారిత గీతాలకన్నా భిన్నంగా తోస్తుంది. ఎందుకంటే, ఇందులో జాన్‌పురి, ఆదానా వంటి ఇతర రాగాలు దర్బారీతో కలసి ఉన్నాయి. లతా మంగేష్కర్ కాబట్టి అతి సునాయాసంగా మిశ్రమ రాగాల గీతాన్ని అత్యద్భుతంగా భావాలు చిలికిస్తూ పాడింది. మాములు గాయనిలు ఇబ్బంది పడతారు. దర్బారి రాగ స్వరాలలో 'ధ' పలకరు. 'గ ' పలకకపోతే అది జౌన్పురి రాగం అవుతుంది. ఆరోహణలో 'గ ', అవరోహణలో 'ధ ' లను వదిలితే 'అదాన' రాగం అవుతుంది. ఇలా ఒక స్వరాన్ని పలకటంలోని తేడాలతో రాగాలు మారిపోతాయి. అలాంటి స్వరాలను అలానే పలుకుతూ, రాగ స్వచ్ఛతను కాపాడుతూ భావాలు చిలికించటం అంత మామూలు విషయం కాదు. ఇలాంటి క్లిష్టమైన పనిని అత్యంత అద్భుతంగా నిర్వహించారు ఆనాటి కళాకారులు. ఒకోపాట వింటూ, ఆ పాటలో ఒకో పదాన్ని పలికిన తీరు, ఆ స్వరానికి ఆ పదాన్ని రాసిన రచయిత ప్రతిభలను విశ్లేశిస్తూంటే ఒక జీవిత కాలం సరిపోదు ఒక పాటలోని సృజనాత్మక స్వరూపాన్ని సంపూర్ణంగా అనుభవించేందుకు అనిపిస్తుంది. అందుకే ఆనాటి పాటలు ఈనాటికీ సజీవంగా ఉన్నాయి. గాయనీ గాయకులు ఈనాటికీ తమ గీతాల ద్వారా సజీవంగా ఉన్నారు.

సామాన్య శ్రోతకు ఈ రాగాలు, అలంకారాలు తెలియనవసరంలేదు. పాట మొత్తంగా వారి మనస్సులపై చూపే ప్రభావం మాత్రమే వారు గ్రహిస్తారు. 'స' దగ్గర దీర్ఘం తీశాడా? తీస్తే అక్కడ కంపనలు కలిగించాడా? అలా కలిగిస్తే రాగం మారిందా? వంటివి వారికి అవసరంలేదు. వడ్డించిన భోజనం రుచికరంగా ఉందా? లేదా? అన్నదే వారికి కావాలి. కానీ భోజనం తయారు చేసే వాడికి మాత్రం ఏది ఎంత కలవాలి, ఎంత వేడి చేయాలి వంటివన్నీ తెలిసి ఉండాలి. ఆ కాలంలో సంగీత దర్శకులకు, గేయ రచయితలకు, గాయనీగాయకులకు, వాయిద్య కారులకు ఈ విషయాలు తెలుసు. అందుకని వారు అందించిన పాటల రుచి తరతరాలు తరగని గని. ఇప్పటి పాటలలో పలుకారణాల వల్ల అందుకుంటున్నవారికి, అందించే వారికీ ఇంతటి పరిజ్ఞానం లేకపోవటం వల్ల సుడిగాలి శరీరాన్ని కంపించేసినట్టు పాటలు ఊపేస్తున్నాయి. తరువాత వెళ్లిపోతున్నాయి. ఈనాటికీ  అక్కడక్కడా మధురగీతాలు అరుదుగా వస్తున్నాయి. కానీ , అధిక శాతం గాలి తరగల్లా 'తాకి' వెళ్లి పోతున్నాయి. మనసులో నిలిచి మురిపించటం లేదు.

(మరిన్ని మధుర గీతాలతో వచ్చే నెల కలుద్దాం)

Click here to share your comments